# చిన్నబ్బ

## - సౌభాగ్య

విపరీతమైన వర్షాలు పడుతున్నాయి. తుఫాను ప్రభావం అనుకుంటాను. మా వూరికి వెళ్ళాలంటే మరీ కష్టం. వర్షాలు విపరీతంగా పడుతూ వుంటే మా వూరికి ఆరు కిలోమీటర్ల దూరంలో బస్సులు ఆగిపోతాయి. కారణం అక్కడ ఒక ఏరు వుంది. దాన్ని గాజులఏరు అంటారు. గాజుల శబ్దం చేస్తూ గలగలా నీళ్ళు ప్రవహించడంవల్ల వెనకటి రోజుల్లో ఎవరో ఆ పేరు పెట్టినట్లున్నారు. ఎందరు ఎమ్మెల్యేలు, ప్రభుత్వాలు మారినా ఆ ఏటికి బ్రిడ్జి కట్టడమంటూ నేటికీ జరగలేదు. ఏట్లో ఉధృతంగా నీళ్ళు ప్రవహిస్తే బస్సులు ఏరిదాటిపోవు. మనుషులు ఎలా దాటుతారంటే అది దైవాధీన వ్యవహారం.

అట్లాగే దైవం మీద భారం వేసి ఏరుదాటి ఆరు కిలోమీటర్లు నడిచి మా ఇంటికి చేరాను. మా అమ్మ వేడివేడి కాఫీ ఇచ్చింది. తల తుడుచుకుని కాఫీ తాగి కాసేపు విశ్రాంతి తీసుకున్నాను.

మా వూరి పేరు అగ్రహారం. అగ్రహారాలు చాలా వుంటాయి గనక మా వూరి పేరు వి.ఆర్.అగ్రహారం అంటారు. అంటే వెంకట్రామ రాజపుర అగ్రహారం. షార్ట్‌ఫాంలో వి.ఆర్.అగ్రహారం అంటారు. పూర్వ కాలం రాజుగారెవరో ఇక్కడివాళ్ళకు దానం చేసినట్లు మా వూరికి దగ్గరగా వున్న ఒక పెద్ద బండపై శాసనం కూడా చెక్కినట్లు చెబుతారు. నేనైతే చూడలేదు.

నేను వుద్యోగరీత్యా హైదరాబాదు చేరి పదిహేను సంవత్సరాలైంది. సెలవుల్లో వస్తూ వుంటాను.

కాసేపు విశ్రాంతి తీసుకుని లేచేసరికి మా అమ్మ నా దగ్గరికొచ్చి కూచుంది. మాది చాలా చిన్న గ్రామం. నేను సెలవుల్లో వచ్చినప్పుడల్లా మా అమ్మ గ్రామ విశేషాలన్నీ వివరంగా చెప్పేది. గ్రామంలో మార్పుల్ని విశ్లేషించేది. ఇటీవల ఎవరెవరికి పెళ్ళిళ్ళయ్యాయి. ఎవరు పోట్లాడుకున్నారు? ఎవరు చనిపోయారు మొదలయిన విశేషాలు చెప్పేది.

“ఈ సంగతి తెలుసా? కూరపర్తి చిన్నబ్బ నెలరోజుల నుంచీ కనిపించడంలేదు.” ఈ మాటలు వింటూనే ఒక్కసారిగా ఆశ్చర్యపోయాను. నా ఆలోచనలన్నీ స్తంభించాయి.

“చిన్నబ్బ కనిపించడంలేదా!” అన్నాను.

• • •

మా పల్లెకు కనుచూపుమేరలో ‘కోనేటివారిపల్లె’ అని ఒక గ్రామం వుంది. ఆ గ్రామంలో రమణ అని నా బాల్యమిత్రుడు వుండేవాడు. ఆ రమణకు ఈ చిన్నబ్బ మేనమామ అవుతాడు. అప్పట్లో నేను రోజూ వాళ్ళ ఇంటికి వెళ్ళేవాణ్ణి. అక్కడే భోంచేసేవాణ్ణి. ఆ రోజులన్నీ గుర్తొచ్చాయి.

చిన్నబ్బ అసలు పేరు చిన్నప్పరెడ్డి. అందరూ చిన్నబ్బ అని పిలిచేవాళ్ళు.

మా చుట్టుపక్కల గ్రామాల్లో అంత విలక్షణమైన వ్యక్తిత్వం వున్న మనిషిని నేను ఇప్పటి వరకూ చూడలేదు.

ఇప్పుడు ఆలోచిస్తూ వుంటే చిన్నబ్బ ఎందుకలా తయారయ్యాడో కొద్ది కొద్దిగా తెలిసి వస్తోంది.

చిన్నబ్బని చూసినప్పుడల్లా ‘నాకు ఆనాటి వేమన గుర్తొచ్చేవాడు. చిన్నబ్బ ఎవర్నీ లెక్కపెట్టేవాడు కాదు. గ్రామంలో వున్న భూస్వాముల్ని కూడా నిర్భయంగా తిట్టేవాడు. డబ్బులకోసం వాళ్ళెంత కక్కుర్తి పడతారో అందరి ముందూ బాహాటంగా చెప్పేవాడు. వాళ్ళెంత నీచకార్యాలకు తలపడతారో వాళ్ళముందే చెప్పి వాళ్ళ గుట్టు రట్టు చేసేవాడు.

ధనవంతులు అతనంటే జడుసుకునేవాళ్ళు. అతనికి దూరంగా తొలగిపోయేవాళ్ళు. మనిషి ఎలాంటి వాడయినా చిన్నబ్బ ముందు నిలబడితే ఆ వ్యక్తిలోని మంచి చెడ్డలు క్షణంలో పసికట్టేవాడు. చాలామంది అతన్ని వింతగా చూసేవాళ్ళు.

చిన్నబ్బ పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి చేసుకున్నవాళ్ళు ఎట్లా బతుకుని బందిఖానాలో పడవేస్తున్నారో చెప్పేవాడు.

చిన్నబ్బలో గొప్ప స్వేచ్ఛా ప్రియత్వాన్ని చూశాను.

ఇంట్లో తనకు రావలసిన ఆస్తిని వాటా రాసివ్వమని అడిగి, వచ్చిన ఆస్తిని తెగనమ్మి కర్చు పెట్టేశాడు. ఏపనీ చేసేవాడు కాడు. డబ్బుంటే తాగేవాడు. లేకుంటే తాగేవాడు కాదు. బీడీలు తాగేవాడు. తిండిపట్ల ధ్యాస వుండేదికాదు. సమయానికి తినకపోవడంవల్ల అల్సర్‌తో బాధపడేవాడు. కడుపునొప్పి వచ్చినప్పుడు తినే సోడా ఒక చిటికెడు నోట్లో వేసుకుని నీళ్ళు తాగేవాడు.

ఆకలి వేస్తే తమ్ముడి ఇంటికి వెళ్ళి తినేవాడు. వాళ్ళెవరూ చిన్నబ్బని ఏమీ అనేవాళ్ళుకాదు. అన్నం పెట్టేవాళ్ళు. వాళ్ళ ఇంట్లో తిని వాళ్ళనే రెండు తిట్టి వెళ్ళేవాడు.

సమయం దొరికితే ఈ అస్తవ్యస్త వ్యవస్థ గురించి దోషారోపణ చేసేవాడు. అది ‘విప్లవాత్మక ఆధునిక శాస్త్రీయ ధోరణి’లో కాదు. దానికి తగిన చదువూ, విజ్ఞానమూ ఆయనకు లేవు.

చదువూ, విజ్ఞానమూ కూడా ఆయన విమర్శనించి తప్పించుకోలేకపోయాయి.

ఆయన విమర్శ వర్షం లాంటిది. ఎండలాంటిది. సహజంగా, అసంకల్పితంగా ఆయన ప్రతిక్రియ వుండేది.

మనుషుల్లోని ఆశని ఆయన అసహ్యించుకునేవాడు. మనసబుని, కర్మాన్ని, వివిధ వృత్తులవారిని, బ్రతుకు తెరువుకోసం అరబ్ దేశాలకు వెళ్ళినవాళ్ళని అందర్నీ కలిపి తిట్టేవాడు. నియమాలు, నిబంధనలు, పద్ధతులు, పండుగలు, ఈ అనంత సృష్టి ఆయన ముందు బోనులో నిల్చుని వుంటే బండబూతులు తిట్టేవాడు.

ఆయన్లోని చైతన్యం నన్ను ఆకర్షించేది.

ఇన్నేళ్ళ పరిచయంలో ఒక్కసారి మాత్రమే సారా తాగడానికి ‘ఐదు రూపాయలుంటే ఇవ్వు’ అని నన్నడిగి తీసుకున్నాడు.

మనముందు ఒకమనిషి చనిపోయి పడివుంటే కూడా అతని గతాన్ని నిర్దయగా బహిరంగ పరిచేవాడు. అంత స్వతంత్ర జీవిని మనం ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ చూడం.

ఆ నిప్పులు చిమ్మే మాటల వెనక, ఆ నిర్భీతి వెనక వున్న కారణాలు నాకు తట్టలేదు.

ఆస్తికి, బాధ్యతకు, శ్రమకు, పెళ్ళిపెడాకులకు ఎడంగా తన జీవితాన్ని ‘రక్షించు’కున్న చిన్నబ్బ ఇప్పుడు నాకు అసలు రూపంతో కనబడుతున్నాడు. బహుశా ఈ సంగతి, ఆయన ఇలా ఎందుకయ్యాడన్న సంగతి ఆయనక్కూడా తెలీదనే సంగతి ఇప్పటికీ నేను నమ్ముతున్నాను.

చిన్నబ్బకు ఒక అక్క, ఒక అన్న ఇద్దరు చెల్లెళ్ళు ఒక తమ్ముడు. అందరూ చిన్నవాళ్ళుగా వున్నప్పుడే చిన్నబ్బ తండ్రి ఇంట్లో గొడవపడి గన్నేరు కాయలు దంచుకుని తిని చనిపోయాడు.

కొంతకాలం గడిచాకా కుటుంబ బాధ్యతల్ని వొదిలి అన్న వేరే కాపురం పెట్టాడు. కళ్ళ ఎదుటే అనారోగ్యంతో భర్త చనిపోతే ఇద్దరు పిల్లల్తో అక్క పుట్టింటికి వచ్చింది. ఆ పిల్లల్లో రెండోవాడే నా స్నేహితుడు.

ఒక చెల్లెల్ని మతిస్థిమితం లేనివాడికిచ్చి చేస్తే మరుసటిరోజే ఇల్లు చేరింది. రెండో చెల్లెలు హృద్రోగంతో పెళ్ళికి అనర్హులారై ఇంటిపట్టున వుండేది. అప్పుడే కష్టపడి డిగ్రీ ముగించిన చిన్న తమ్ముడు చిన్న వుద్యోగంలో చేరి సంసార భారాన్ని మోసేవాడు.

చిన్నప్పట్నించీ బలహీనమైన శరీరం కావడంవల్ల, చదువులేకపోవడంవల్ల చిన్నబ్బ ఏపనీ చేసేవాడు కాదు. తన వూహ తెలిసిన నాటినించీ అన్నీ కళ్ళారా చూసిన చిన్నబ్బ ఈ ప్రపంచం మీద సృష్టికర్త మీద పగపెంచుకున్నాడు. నియమబద్ధమైన జీవితానికి నీళ్ళు వదులుకున్నాడు.

తనని ఎన్ని తిట్టినా అన్న సున్నితమైన మనసు తెలిసిన తమ్ముడు ఎప్పుడూ అన్నను ఏమీ అనేవాడు కాడు. అన్న అవసరాలు తీర్చేవాడు. అన్నం పెట్టేవాడు. జబ్బు చేస్తే డాక్టర్‌కు చూపించేవాడు.

ఎన్ని చేసినా చిన్నబ్బ ఆరోగ్యం పద్ధతిలేని జీవితంతో పతనానికి చేరుకుంది.

మూడేళ్ళ క్రితం టీబీ లక్షణాలు కూడా కనిపించాయి. కడుపు నొప్పి ఎలానూ తోడుగా వుంది. మనిషి ఎముకల గూడులా తయారయ్యాడు.



గత సంవత్సరం నేను సెలవుల్లో వచ్చినప్పుడు నాతో చిన్నబ్బ అన్న మాటలు మనసులో మెదిలాయి.

''చూడూ! మా కృష్ణారెడ్డి (తమ్ముడు) ఇన్ని కష్టాలు పడుతూ అందరి మంచీచెడ్డలు చూస్తున్నాడు. నేను కూడా వాడికి భారం కాలేను. ఈపాడు బతుకు ఎన్నాళ్ళు బతికి ఏం లాభం? దీనమ్మ (బండబూతు) బతుకు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఎవరికీ కనిపించకుండా ఎక్కడికో వెళ్ళి చనిపోతాను.''

అంత వైరాగ్యం ఆయన్లో నేను చూడడం అదే మొదటిసారి.

''అట్లా ఎందుకంటావు చిన్నబ్బా! మన చేతుల్లో ఏముంది?'' అన్నాను.

''నువ్వు చదువుకున్నవాడివి. నీకేమైనా బుద్ధుందా? నువ్వూ అందరిలా మాట్లాడుతావు.'' అని నన్ను తిట్టాడు.

అప్పటికి ఆచర్చ వదిలేశాం. నేనూ మరచిపోయాను.

ఇప్పుడు మా అమ్మ చెప్పేసరికి ఆ సంగతులన్నీ గుర్తొచ్చాయి. దగ్గరగా వున్న కొండలకేసి చూశాను. ఆ కొండల్లో అడవులు, అజ్ఞాతమైన లోయలు ఎన్నోవున్నాయి.

తనకు ఆరోగ్యం అదుపు తప్పుతోందని తెలిసినప్పుడు ఎప్పుడో చిన్నబ్బ ఆ అరణ్యాల్లోకి వెళ్ళిపోయి వుంటాడు. ఈ మనుషులచేత సేవ చేయించుకోడానికి మనసొప్పని మానధనుడు అలా మాయమైపోయివుంటాడని తీర్మానించుకున్నాను.

• • •

జీవితాన్ని జయించినవాడు ఎవడన్నా వున్నాడంటే అతను చిన్నబ్బే అనిపించింది నాకు.

నా కళ్ళలో రెండు కన్నీటి చుక్కలు కదిలాయి.

ఎవరూ చూడకుండా తుడుచుకున్నాను.

నా కన్నీళ్ళని చూసి నవ్వుకుంటున్న చిన్నబ్బ నా మనసులో మెదిలాడు.

★